క్లుప్తంగా

నేడు గోదాముల ప్రారంభం

చొప్పదండి : చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళపల్లి రోడ్డులో నిర్మించిన గోదాములను గురువారం టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు ప్రారంభించనున్నట్లు చైర్మన్ వెల్మ మల్లారెడ్డి తెలిపారు. సహకార సంఘం 72వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంఘం పరిధిలోని రైతులంతా సమావేశానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఉత్సవాలకు ఆలయం ముస్తాబు



చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ శివారులో గల వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షిక ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 24న స్వామివారిని గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయం నుంచి గుట్టపైకి తీసుకెళ్తారని, 25న ఉదయం వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈనెల 26న సాయంత్రం చైత్ర శుక్ల పంచమిని పురస్కరించుకొని గుట్టబండ్ల జాతర జరుగుతుందని, భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న బీజేపీ నాయకులు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన బత్తుల కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి బీజేపీ నాయకులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి 50 కిలోల బియ్యం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నగునూరి శంకర్, ఉపాధ్యక్షుడు గడ్డం సుమిత్ రెడ్డి, బొజ్జ ఎల్లయ్య, కూన లక్ష్మణ్, బుర్ర రమేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామనవమికి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్ తోట కోటేశ్వర్

గన్నేరువరం: ఈనెల 30న శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని మైలారం గ్రామం నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను బుధవారం ఉత్సవ కమిటీ చైర్మన్ తోట కోటేశ్వర్ పరిశీలించారు. శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పక్కన, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరివెంట మర్రి వెంకటమల్లు, తోట పవన్, గువ్వ పర్శయ్య, పులి రామకృష్ణగౌడ్, బుర్ర చంద్రశేఖర్ గౌడ్, తోట రాజు, దొగ్గల జగన్, మడికంటి శ్రీనివాస్, ఇట్టనేని నాగరాజు, తోట ప్రశాంత్, నూకల చింటు, గంగపెల్లి నరేశ్ పాల్గొన్నారు.

శ్రీసీతారామచంద్రస్వామి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



పల్లకి సేవలో పాల్గొన్న మేయర్ సునీల్‌రావు దంపతులు, భక్తులు

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ 33వ డివిజన్ భగత్‌నగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి వసంత నవరాత్రి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మేయర్ యాదగిరి సునీల్‌రావు–అపర్ణ దంపతులు తమ నివాసంలో సీతారాముల ఉత్సవమూర్తులకు వేద మంత్రోచ్ఛరణల మధ్య పంచామృతాలతో అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఎదుర్కోలుగా పెద్ద ఎత్తున ర్యాలీతో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఆలయంలో చైతన్య యూత్ క్లబ్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్రస్వామి వసంత నవరాత్రి వేడుకలు 9 రోజులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో చైతన్య యూత్ క్లబ్ సభ్యులు, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు



కాట్రపల్లిలో ఎడ్లబండి పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ అనిత



ఖాసీంపేటలో పంచాంగ శ్రవణం చేస్తున్న పండితుడు



ఉగాది పచ్చడి, కాషాయ జెండాలను పంపిణీ చేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు

హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గాల్లో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే భక్తులు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచులతో తయారుచేసిన పచ్చడి, పిండి వంటలు చేసి ఆరగించారు. రైతులు వ్యవసాయ పనులకు సాగుబడి చేశారు. కాట్రపల్లిలో ఎంపీటీసీ రావుల అనిత ఎడ్ల బండి పోటీలను నిర్వహించారు. ప్రథమ విజేతలకు టీఆర్‌ఎస్ యువ నాయకుడు వొడితెల ప్రణవ్ రూ.10వేలను అందజేశారు. వేద పండితులు పంచాంగ శ్రవణం పఠించారు.

– సాక్షి నెట్‌వర్క్



జమ్మికుంటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న వేద పండితులు

గ్రామాల్లో సామాజిక సర్వే



సమావేశంలో ప్రజాప్రతినిధులు, వలంటీర్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని దుర్శేడ్, నల్లగుంటపల్లి గ్రామాల్లో ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా వలంటీర్లు బుధవారం సామాజిక సర్వే చేపట్టారు. నల్లగుంటపల్లిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి, హనుమాన్ ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సర్పంచు వద్దూరి సంతోష, ఎంపీటీసీ సభ్యురాలు గొల్లె రాజ్యలక్ష్మిలు మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లోకి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు నాయుడు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, మంత్రి గంగుల చిత్రపటానికి క్షీరాభిషేకం

కరీంనగర్: ఈద్గా, షాదీఖానా, శ్మశానవాటికల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం పట్ల బీఆర్‌ఎస్ మైనారిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సుడా డైరెక్టర్ షేక్ యూసుఫ్ ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ చౌక్‌లో సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్‌ల చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు. సాలెనగర్ ఈద్గా ప్రహరీ నిర్మాణానికి రూ.20 లక్షలు, కరీంల్లాషా దర్గాకి రూ.20 లక్షలు, చింతకుంటలో నూతనంగా నిర్మించే షాదీఖానాకు రూ.2 కోట్ల ప్రొసీడింగ్, కబరస్తాన్‌ల అభివృద్ధికి రూ.30 లక్షలు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీ నాయకులు జమీలొద్దీన్, సాబీర్, పాషా, ఫహాద్ తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ ముస్లిం నాయకులు

పరిహారం అందేనా..

- మండలంలో అకాల వర్షాలకు మొక్కజొన్న, మామిడికి తీవ్ర నష్టం
- ఆందోళనలో రైతులు
- 170 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారుల అంచనా

గన్నేరువరం: అకాలవర్షానికి రైతుల పంటలకు నష్టం వాటిల్లుతుంది. ఏటా వడగళ్లు, భారీ వర్షాలు, ఈదురుగాలులతో వరి, మొక్కజొన్న, మామిడి, కూరగాయాల పంటలకు అపారనష్టం జరుగుతోంది. ప్రభుత్వ నుంచి పరిహారం మాత్రం అందని ద్రాక్షగా లాగా మిగులుతుంది. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి కుడి కాల్వకు సాగునీటి విడుదలతో రైతులు వరి, మొక్కజొన్న పంటలు సాగుచేశారు. ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి పంటలను రైతులు కాపాడుకున్నారు. పంట చేతికందే సమయంలో వడగళ్లతో మొక్కజొన్న, మామిడి తోటలు, కూరగాయలు సాగుచేసిన రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. అధికారులు మాత్రం 33 శాతం పైగా పంటనష్టం జరిగిందని, దీనికి పరిహారం వర్తించదని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

ఈ ఏడాది రబీలో పంటల సాగు 14వేల లక్ష్యం కాగా 10 వేల ఎకరాల్లో వరిపంటను రైతులు సాగు చేస్తున్నారు. మొక్కజొన్న 600, పొద్దు తిరుగుడు 400, ఆయిల్‌పామ్ 110, కూరగాయాలు 100, వేరుశనగ 30 ఎకరాల్లో సాగుచేశారు. గతేడాది నుంచి మొక్కజొన్నకు మార్కెట్‌లో రూ.2వేల ధర ఉంది. గత ఏడాది మార్కెట్ 2600 వరకు వెళ్లింది. దీంతో 600 ఎకరాలకు పైగా మొక్కజొన్న సాగు పెరిగింది. ఖాసీంపేట, మాదాపూర్ గ్రామాల్లో దాదాపు 450 ఎకరాల వరకు సాగుచేశారు. మిగతా గ్రామాల్లో పదుల సంఖ్యలోనే సాగైంది. పొద్దు తిరుగుడు పంట పారువెల్ల గ్రామానికే పరిమితమైంది.



మాదాపూర్‌లో నేలవాలిన మొక్కజొన్న

నష్టం జరిగింది ఇలా...

మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, మామిడితోటలకు నష్టం జరిగింది. 170 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. 150 ఎకరాల వరకు మామిడిపంటకు నష్టం జరిగినట్లు ఆర్టికల్చర్ మానకొండూర్ నియోజకవర్గ అధికారి స్వాతి తెలిపారు.

2020లో..

2020లో వడగళ్ల వర్షాలకు మండలంలో 1237 ఎకరాల్లో వరి, 7 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం జరిగగా ఇప్పటివకు వరకు పరిహారం ఊసేలేదు. గన్నేరువరం 166 మంది రైతులు 388 ఎకరాలు, యాస్వాడలో 14 మంది రైతులు 26 ఎకరాలు, మాదాపూర్‌లో 105 మంది రైతులు 181 ఎకరాలు, హన్మాజిపల్లెలో 96 మంది రైతులు 152 ఎకరాలు, ఖాసీంపేటలో 13 మంది రైతులు 18 ఎకరాలు, పారువెల్లలో 110 రైతులు 129 ఎకరాలు, మైలారంలో 127 మంది రైతులు188 ఎకరాలు, జంగపల్లిలో 212 మంది రైతులు 362 ఎకరాల్లో వరి, మొక్కజొన్న ఖాసీంపేటలో ఇద్దరు రైతులు 5 ఎకరాలు, పారువెల్లలో ఇద్దరు రైతులు 2 ఎకరాల్లో పంట నష్టపోయారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకం జాడలేకుండా పోయింది.



మాదాపూర్‌లో రాలిన మామిడికాయలు

రైతులను ఆదుకోవాలి



వడగళ్లతో మొక్కజొన్న, మామిడితోటలు, కూరగాయలు, పొద్దు తిరుగుడు పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. నేను సాగుచేసిన మూడెకరాల్లో మొక్కజొన్న నేలవాలింది. ఏటా అకాలవర్షాలకు నష్టం జరుగుతున్నా ప్రభుత్వం పంట నష్టపరిహారం ఇవ్వడం లేదు. సర్కారు పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

– బండి తిరుపతి, మాదాపూర్ రైతు

నివేదికను అధికారులకు పంపించాం



అకాలవర్షానికి మండలంలో పంటనష్టంపై గ్రామాలవారీగా సర్వే పూర్తిచేశాం. ఖాసీంపేట, మాదాపూర్, పారువెల్ల గ్రామాల్లో 170 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం జరిగినట్లు అంచనా వేశాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దు. నివేదికను జిల్లా అధికారులకు పంపించాం.

– కిరణ్మయి, వ్యవసాయశాఖ అధికారి

ప్రజా చైతన్య యాత్రకు తరలిరండి



కరపత్రాలు పంచుతున్న సీపీఎం నాయకులు

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న కరీంనగర్ జిల్లాలో నిర్వహించే సీపీఎం ప్రజా చైతన్య యాత్రకు తరలిరావాలని ఆ పార్టీ నగర కార్యదర్శి గుడికందుల సత్యం కోరారు. బుధవారం స్థానిక బస్టాండ్‌లో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం నగరంలోని ప్రయాణ ప్రాంగణం, తెలంగాణ చౌక్, కశ్మీర్ గడ్డ, ఆదర్శనగర్, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతోందని ఆరోపించారు. రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1,200కు పెంచి, ప్రజలపై భారం వేస్తున్నారని పేర్కొన్నారు. డీజిల్, పెట్రోల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురాకుండా రోజురోజుకూ పెంచుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ రాష్ట్రంలో 33 జిల్లాలు తిరుగుతూ సీపీఎం ప్రజా చైతన్య యాత్ర ఈ నెల 26న కరీంనగర్ చేరుకుంటుందని అన్నారు. ప్రజలు, మేధావులు, కార్మిక సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటలకు నగరంలోని తెలంగాణ చౌక్ వద్ద సభ, అనంతరం రోడ్ షోగా వెళ్లి, కోతిరాంపూర్‌లోని అన్నమనేని గార్డెన్స్‌లో మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. సీపీఎం నగర కమిటీ సభ్యులు పుల్లెల మల్లయ్య,పు న్నం రవి, కొంపల్లి సాగర్ నాయకులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గంగాధర: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. బుధవారం మండలంలోని కొట్ల నర్సింహులపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అభివృద్ధి పనులకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తుందన్నారు. గ్రామాల్లో మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, డంపింగ్ యార్డుల ఏర్పాటు, కొత్త గ్రామ పంచాయితీలకు సొంత భవనాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ తోట కవిత మల్లారెడ్డి, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చిత్ర కథ: కవర్లతో ఇటుకలకు రక్షణ



అకాల వర్షాలతో పంటలు నేలవాలడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. గతంలో వర్షాలకు మట్టి ఇటుకలు తడవడంతో వ్యాపారులు నష్టపోగా ప్రస్తుతం అప్రమత్తమైన కొందరు వర్షాల నుంచి మట్టి ఇటుకలు, బట్టీ తడవకుండా రక్షణగా ప్లాస్టిక్ కవర్లు కప్పారు. కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్ శివారులో ఓ వ్యాపారి ఇటుకలపై రక్షణగా కట్టిన కవర్లను గ్రామస్తులు ఆసక్తిగా చూస్తున్నారు. – కరీంనగర్‌రూరల్

నేడు బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం

గన్నేరువరం: ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా గన్నేరువరంలో గౌడ సంఘం భవనంలో నేడు ఉదయం 10 గంటలకు జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ, రైతుబంధు సమితి సభ్యులు, గ్రామశాఖ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ, సింగిల్‌విండో డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాటర్ కూలర్ బహూకరణ



వాటర్ కూలర్‌ను బహూకరిస్తున్న శ్రీకాంత్ రెడ్డి

జమ్మికుంట: పట్టణంలోని శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయం (బొమ్మల గుడి)లో అన్నపూర్ణ సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీసాయి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ పచ్చిక శ్రీకాంత్‌రెడ్డి వాటర్ కూలర్‌ను బహూకరించారు. అనంతరం ఆలయంలో అన్నదానం నిర్వహించారు. దాతల సహకారంతో నిత్యాన్నదానం చేస్తున్నామని అన్నపూర్ణ సేవాసమితి కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం వైద్యుడు పచ్చిక శ్రీకాంత్‌రెడ్డిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సేవా సమితి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాల సందడి



బోనాలతో ఆలయం ఎదుట భక్తులు

శంకరపట్నం: మండలంలోని ఊరూరా పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. గద్దపాక, ఆముదాలపల్లి, తాడికల్‌తో పాటు పలు గ్రామాల్లోని మహిళలు డప్పు చప్పుళ్లతో ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్‌కుమార్ రెడ్డి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సృజన్‌కుమార్

రామడుగు : ఈనెల 26, 27 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి విస్తృతస్థాయి కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కోయ్యడ సృజన్‌కుమార్ కోరారు. మండలకేంద్రంలో బుధవారం కౌన్సిల్ సమావేశాల వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లా నాయకులు గంటి రాజేశం, మచ్చ రమేశ్, గొడిశెల తిరుపతి గౌడ్, నారాయణ రెడ్డి, రవీందర్, కనకయ్య, పలువురు పాల్గొన్నారు.

సింగిల్‌విండో చైర్మన్‌కు పరామర్శ



శ్యాంసుందర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, మేయర్

కరీంనగర్‌రూరల్: గుండెపోటుకు గురై, ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్న కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డిని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, నగర మేయర్ వై.సునీల్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అనిల్‌కుమార్, వాల రమణారావు తదితరులు బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి, శస్త్రచికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.